సాక్షి విశాఖపట్నం

బుధవారం । 8 । అక్టోబర్ । 2025



ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ 8లో



దక్షిణాఫ్రికా మహిళా జట్టు వచ్చేసింది 8లో



వాల్మీకి రామాయణం.. మహత్తర సందేశం 8లో

కూటమికి హై టెన్షన్



రేపు విశాఖకు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మెడికల్ కాలేజీ వరకు రోడ్ షో

భద్రత ఇవ్వలేమని పోలీసులతో చెప్పించిన కూటమి ప్రభుత్వం

భారీ జనసందోహాన్ని కట్టడి చేయలేమని అనుమతి నిరాకరణ

ప్రత్యేక హోదా ఉద్యమం సమయంలో జగన్‌ను రన్‌వేపై ఆపేసిన పోలీసులు

ఇప్పుడు అదే ఆలోచనలో కూటమి ప్రభుత్వం..!

విశాఖ సిటీ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి విశాఖ పర్యటన కాకపుట్టిస్తోంది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ సందర్శనకు వస్తుండడం కూటమి ప్రభుత్వంలో గుబులు రేపుతోంది. జగన్ పర్యటనతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కుట్ర బట్టబయలవుతుందన్న భయం వెంటాడుతోంది. దీనికి భారీ జన సందోహం తరలిచ్చే అవకాశం ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వానికి చెమటలు పడుతోంది. దీంతో ఎలాగైనా జగన్ పర్యటనకు అడ్డంకులు సృష్టించాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇందులో భాగంగా జగన్ రోడ్ షోకు భద్రత ఇవ్వలేమని పోలీసు అధికారులతో చెప్పించింది. మంగళవారం విశాఖ పోలీస్ కమిషనర్, అనకాపల్లి జిల్లా ఎస్పీలతో అత్యవసర మీడియా సమావేశాలు పెట్టించింది. తమిళనాడులో జరిగిన తొక్కిసలాటను సాకుగా చూపించి జగన్ పర్యటనకు వచ్చే భారీ జన సందోహాన్ని కట్టడి చేయలేమని చేతులెత్తేసింది.

పర్యటనను అడ్డుకునే కుట్ర

మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్‌షో ద్వారా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మెడికల్ కాలేజీకి వెళ్లనున్నారు. ఈ మెడికల్ కాలేజీ సందర్శనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం అధికార బలాన్ని గట్టిగా ప్రదర్శించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం భద్రత, ట్రాఫిక్, తోపులాటలు వంటి సాకులను తెరపైకి తీసుకొస్తోంది. విశాఖలో రెండు లక్షల మందితో విజయవంతంగా జరిగిన సమావేశాలు ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలతో యాత్రలు జరిగాయి. కానీ జగన్ రోడ్‌షోకు మాత్రం ఈ సాకుల పేరుతో అనుమతి నిరాకరించింది. జగన్ పర్యటనలకు వస్తున్న ప్రజాదరణ చూపి కూటమికి కంటగింపుగా మారింది. దీంతో ఆ జనాల్లో భయభ్రాంతులు సృష్టించడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. అనుమతి లేని జగన్ రోడ్‌షోలో పాల్గొనడం చట్ట విరుద్ధమని పోలీసులతో హెచ్చరికలు జారీ చేయించింది. వైద్య కళాశాలలు లేవని, వాటికి అనుమతులు లేవని సవాల్ విసిరిన అమాత్యులే ఇప్పుడు జగన్ పర్యటనను అడ్డుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేయడం గమనార్హం.

సవాల్ విసిరిన అమాత్యులకే చెమటలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు చేపట్టింది. వీటిలో అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో కూడా కాలేజీ నిర్మాణంలో ఉంది. ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. మెడికల్ కాలేజీల నిర్మాణమే జరగలేదని హోంమంత్రి వంగలపూడి అనిత, కాలేజీకి అనుమతి ఉంటే చూపించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సవాల్ విసిరారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. ఇదిలా ఉంటే నిర్మాణం పూర్తయిన ఐదు కాలేజీలతో పాటు నిర్మాణంలో ఉన్న 12 కాలేజీల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. వైద్య కళాశాలలే లేవని బుకాయించే ప్రయత్నం చేసిన కూటమి ప్రభుత్వం బండారం బట్టబయలైంది. ఇంతలో మాకవరపాలెంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన రానున్నారు. దీంతో మెడికల్ కాలేజీలపై సవాల్ విసిరిన అమాత్యులకు చెమటలు పడుతున్నాయి. జగన్ పర్యటనతో కూటమి ప్రభుత్వం అబద్ధాలు బయటపడతాయన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు.

ముందస్తు అరెస్టులకు సిద్ధం

వైఎస్.జగన్ రోడ్‌షోకు భారీగా జనాలు తరలివెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు పోలీసుల ద్వారా వైఎస్సార్ సీపీ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే నేతల హౌస్ అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ నేతలు మాత్రం జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రతి వార్డు నుంచి భారీగా పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టుకు వెళ్లి పార్టీ అధినేతకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

నాటి ఘటన పునరావృతం కానుందా?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ 2017 జనవరి 26న బీచ్‌రోడ్డులో 'క్యాండిల్ లైట్ ర్యాలీ'లో పాల్గొనడానికి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. విమానాశ్రయం రన్‌వే పైనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జగన్‌ను నిలువరించింది. పోలీసుల సాయంతో జగన్‌ను ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాకుండానే చేసి వెనక్కి పంపించింది. ఆ ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తరహాలో జగన్‌ను ఎయిర్‌పోర్టులోనే అడ్డుకునే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే కూటమి ప్రభుత్వానికే నష్టమని ఆ పార్టీల నేతలే అభిప్రాయపడుతున్నారు.

ఆంక్షలు విధించినా ఆగేది లేదు!

- మాజీ సీఎం వైఎస్ జగన్ మాకవరపాలెం మెడికల్ కాలేజీకి రోడ్డు మార్గానే వెళ్తారు
- హెలిప్యాడ్‌కు అనుమతి ఇస్తామనడంలో కుట్ర కోణం ఉందన్న అనుమానాలున్నాయి
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం : నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించడానికి ఈనెల 9వ తేదీన రానున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్రచేస్తోందని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు మండిపడ్డారు. ఎన్ని ఆంక్షలు విధించినా వైఎస్ జగన్ పర్యటన ఆగేది లేదని స్పష్టం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ పర్యటనకు భద్రత కల్పించాలని మూడు రోజుల క్రితమే అనకాపల్లి ఎస్పీ, విశాఖ సీపీని కోరామని, ఇప్పటివరకూ కాలయాపన చేసిన వారు జాతీయ రహదారిపై రోడ్డు మార్గంలో వెళ్లడానికి అనుమతి లేదని చెబుతున్నారన్నారు. విశాఖ నుంచి మాకవరపాలేనికి జాతీయ రహదారి కాకుండా ప్రత్యామ్నాయ రోడ్డు చూపించాలని అడుగుతున్నామన్నారు. అయినా పర్యటనకు తాము అనుమతి కోరలేదని.. సెక్యూరిటీ మాత్రమే కల్పించాలని అడిగామని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకు వస్తున్నప్పుడు మీ పర్మిషన్ ఎవరికి కావాలంటూ ధ్వజమెత్తారు. తమ నాయకుడు రోడ్డు మార్గానే మాకవరపాలెం మెడికల్ కాలేజీకి వెళ్తారని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామన్నారు. పోలీసులు, ప్రభుత్వం భద్రత కల్పించకపోతే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే భద్రత కల్పిస్తారని అన్నారు. గతంలో వైఎస్ జగన్ పలు పర్యటనల్లో హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వలేదని.. ఇప్పుడు హెలికాప్టర్ మీదే రావాలంటున్నారంటే.. తనతో పాటు రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులకు, అభిమానులకు అనుమానం వస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులు కూడా సవ్యంగా లేని సమయంలో పదే పదే హెలిప్యాడ్ అనుమతి కోరండి అని చెబుతుంటే, ఇందులో ఏమైనా కుట్ర కోణం ఉందేమోనని అనుమానం ఉందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో జరిగిన సంఘటనను బూచిగా చూపించి అనుమతి ఇవ్వలేమనడం సరికాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు 65 వేల మంది జనాలు వస్తారని పోలీసులు చెబుతుండడం చూస్తుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత అర్థమవుతోందన్నారు. కళ్లు బైర్లు కమ్మి సవాల్ విసిరిన స్పీకర్ అయ్యన్న లాంటి వారి నోటికి తాళాలు వేసేందుకు, ఆయన అసత్య ప్రచారాలకు చెక్ పెట్టి.. మెడికల్ కాలేజీపై వాస్తవాలను తెలియజేసేందుకు వైఎస్ జగన్ ఈనెల 9న మాకవరపాలెం వస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

పెందుర్తి మార్గంలో వెళ్లాలంట!

విశాఖ సిటీ: ఉమ్మడి విశాఖ జిల్లాలో జాతీయ రహదారిపై ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షోకు అనుమతి ఇవ్వని పోలీస్ కమిషనర్ అన్ని వర్గాల నుంచి వ్యతిరేకతతో ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రకటించారు. విశాఖ విమానాశ్రయం నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, బాజీ జంక్షన్, గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్, వేపగుంట జంక్షన్, సుజాతనగర్, పెందుర్తి జంక్షన్, సరిపల్లి జంక్షన్ మీదుగా రోడ్డు మార్గంలో అనుమతించారు. ట్రాఫిక్ ఏసీపీ అనుమతి లేకుండా ఈ మార్గం నుంచి ఎటువంటి మార్పులు, పొడిగింపు, అనుమతి లేని హాల్ట్ చేయకూడదని పేర్కొన్నారు. ఆమోదించిన మార్గంలో ఏదైనా జంక్షన్, రోడ్డు పక్కన పాయింట్ లేదా వేదిక వద్ద నిర్వాహకులు జనసమీకరణ చేయకూడదని తెలిపారు. మార్గంమధ్యలో సమావేశాలు ఏర్పాటు చేయరాదని, ఊరేగింపులు, రోడ్ మార్చ్‌లపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

లోన్‌యాప్ బాధితులకు రికవరీ సొత్తు అందజేత



సొత్తును బాధితురాలికి అందజేస్తున్న సీపీ

విశాఖ సిటీ: ఇన్‌స్టంట్ ఫ్రాడ్ లోన్ యాప్స్ ద్వారా మోసపోయిన బాధితులకు.. కోల్పోయిన మొత్తాన్ని అందించేందుకు రెండో దఫా రిఫండ్ మేళా నిర్వహించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఫ్రాడ్ లోన్ యాప్స్ ఉచ్చులో అనేక మంది అమాయకులు చిక్కుకుని రూ.లక్షలు నష్టపోతున్నారన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు దర్యాప్తు చేసి ఇప్పటి వరకు రూ.60 లక్షల క్రిప్టో కరెన్సీని సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ మొత్తంలో రూ.48 లక్షలను రూ.100 మంది బాధితులకు తొలి దశలో అందజేసినట్లు వెల్లడించారు. రెండో దఫా రిఫండ్ మేళా ద్వారా 26 మంది బాధితులకు రూ.8 లక్షలు అందజేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీసీపీ(క్రైమ్) లతామాధురి, ఏసీపీలు పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ సిటీ : అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. 2025 జూన్ 30 ముందు అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా చట్టబద్ధమైన భవన నిర్మాణాలకు అనుమతులు పొందవచ్చన్నారు. లేఅవుట్లలో మౌలిక సదుపాయాలతో పాటు భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31లోగా నిర్దేశిత డాక్యుమెంట్లతో స్వయంగా గానీ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వీఎంఆర్‌డీఏ ఆఫీస్ గ్రౌండ్ ఫ్లోర్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

10న జాబ్‌మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 100 ఉద్యోగాల భర్తీకి స్థానిక నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్‌సీ)లో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ తెలిపారు. రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్, ఆఫీసర్, బీపీవో, టెలికాలర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18–30 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్ లోకేషన్ ఏపీలోని పలు జిల్లాల్లో ఉంటుందన్నారు.

కురుపాం గురుకుల విద్యార్థినులకు పరామర్శ

మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం



విద్యార్థినుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్

మహారాణిపేట: అస్వస్థత, అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌లతో కలిసి మంత్రి మంగళవారం కేజీహెచ్‌కు వచ్చారు. క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..'ఇప్పటివరకు 53 మంది చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు రాగా, మంగళవారం 13 మంది డిశ్చార్జి అయ్యారు. పూర్తి స్థాయిలో కోలుకున్న తర్వాత మిగిలిన వారిని కూడా ఒకటి, రెండు రోజుల్లో డిశ్చార్జి చేయిస్తాం' అని చెప్పారు. కురుపాం ఘటన, అక్కడి పరిస్థితులపై అధికారుల బృందం విచారిస్తోందని, వారు ఇచ్చే నివేదికల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, సీఎస్ఆర్ఎంవో యు.శ్రీహరి, ఇతర వైద్యాధికారులు మంత్రి వెంట ఉన్నారు.

జగన్‌కు భారీ స్వాగత సన్నాహాలు

లంకెలపాలెం వద్ద నేతల ఏర్పాట్ల పరిశీలన



లంకెలపాలెం కూడలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ధర్మశ్రీ, అదీప్‌రాజ్

అగనంపూడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన నర్సీపట్నం నియోజకవర్గంలోని వైద్య కళాశాలను సందర్శించనుండడంతో.. లంకెలపాలెం కూడలి వద్ద భారీ ఎత్తున స్వాగతం పలకడానికి పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. లంకెలపాలెం కూడలి అనకాపల్లి జిల్లాకు ప్రవేశమార్గం అయినందున.. ఇక్కడ భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు ఆయనకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాజీ సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పార్టీ పీఏసీ సభ్యుడు కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం లంకెలపాలెం కూడలిని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ 79వ వార్డు అధ్యక్షుడు అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు గండి రవికుమార్, సుందరపు అప్పారావు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, రాష్ట్ర సోషల్ మీడియా అధికారిక ప్రతినిధి కర్రి నరసింగరావు, గంజి సురేష్, సునీల్, సిరపువరపు వాసు, ఉగ్గిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆధార్ సీడింగ్

తప్పులు సరిదిద్దుతున్నామన్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ సిటీ: విద్యుత్ సర్వీస్ నెంబర్లకు ఆధార్ సీడింగ్‌లో తప్పులను సరిదిద్దే ప్రక్రియను ఏపీఈపీడీసీఎల్ అధికారులు చేపట్టారు. ఒక ఆధార్ నెంబర్‌కు పదుల సంఖ్యలో విద్యుత్ సర్వీస్ నెంబర్లను జత చేయడం, ఒకరి పేరుతో ఉన్న సర్వీస్ నెంబర్‌కు మరొకరి ఆధార్ అనుసంధానించడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై 'కరెంటోళ్ల నిర్లక్ష్యం.. విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ సీడింగ్ అస్తవ్యస్తం' శీర్షికను సాక్షి కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందిస్తూ.. అస్తవ్యస్తంగా ఉన్న ఆధార్ సీడింగ్ తప్పులు వేగవంతంగా సరిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రకటించారు. కరెంట్ సర్వీస్ నెంబర్‌కు జత చేసిన తప్పుడు ఆధార్ నెంబర్‌ను తొలగించేందుకు గతంలో వినియోగదారులు సచివాలయం, అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయం, ఈఆర్‌వో కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ఏఈ కార్యాలయంలోనే ఆ సమస్యను పరిష్కరిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.శ్యాంబాబు తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో వచ్చే ఈ తరహా ఫిర్యాదులను సైతం ఇదే విధంగా పరిష్కరించి వినియోగదారులకు సమాచారం అందజేస్తున్నామన్నారు.

కేజీహెచ్ నుంచి గిరిజన విద్యార్థినుల డిశ్చార్జి



విద్యార్థులతో సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: పచ్చకామెర్ల వ్యాధి బారిన పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 8 మంది విద్యార్థినులను మంగళవారం పార్వతీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ విద్యార్థినులకు వ్యాధి తగ్గుముఖం పట్టడంతో, వైద్యుల నివేదికల ప్రకారం తరలించినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. డాక్టర్ గిరినాథ్(గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ శివ కల్యాణి (మైక్రోబయాలజీ), డాక్టర్ కృష్ణవేణి (కమ్యూనిటీ మెడిసిన్), డాక్టర్ వాసవి లత (జనరల్ మెడిసిన్), డాక్టర్ చక్రవర్తి (పిల్లల వైద్యుడు)లతో కూడిన ఐదుగురు వైద్యుల బృందం సమర్పించిన నివేదికల ఆధారంగా విద్యార్థులను తరలించినట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 129 మంది విద్యార్థినులు పచ్చకామెర్ల బారిన పడిన విషయం తెలిసిందే. వీరిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని తోయిక కల్పన, 10వ తరగతికి చెందిన పువ్వల అంజలి పచ్చకామెర్లతో మృత్యువాత పడ్డారు. మంగళవారం మరో ఏడుగురు విద్యార్థినులు ఆస్పత్రిలో చేరడంతో.. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 50కి చేరుకుంది.

మంచు కొండల్లో విడిది!

- **లంబసింగిలో 15 డోమ్ రిసార్టులు**
- **రూ.5.33 కోట్లతో ప్రణాళికలు**
- నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ
- మూడు నెలల్లో ప్రాజెక్టు పూర్తికి చర్యలు
- గత ప్రభుత్వ హయాంలో డోమ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రణాళికలు
- వాటిని మార్పు చేసి రిసార్టులుగా డిజైన్ చేసిన అధికారులు





లంబసింగిలో నిర్మించనున్న జియోడెసిక్ డోమ్ రిసార్టుల నమూనా

సాక్షి, విశాఖపట్నం: ఒక పర్యాటక ప్రాంతానికి వెళ్లినప్పుడు హోటల్‌లో బస చేయడం సాధారణం. ఎంత విలాసవంతమైన హోటల్ అయినా అది నాలుగు గోడల మధ్యే ఉంటుంది. కానీ.. ఒక ఊహా ప్రపంచంలో ఉన్నట్లు.. ప్రకృతి మన చుట్టూ ఆవరించినట్లు.. విశాలమైన మంచంపై పడుకుని కళ్లు తెరిస్తే.. ఆ ఊహాలోకం మన చెంతనే ఉన్నట్లు అనిపిస్తే.. ఆ అనుభూతే వేరు కదా! అలాంటి అద్భుత అనుభవాన్ని అందించేందుకు అందాల లంబసింగిలో సరికొత్త పర్యాటక రిసార్టులు రాబోతున్నాయి. వీటినే 'జియోడెసిక్ డోమ్ రిసార్టులు' అంటారు. వీటి నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) టెండర్లను ఆహ్వానించింది.

లంబసింగిలో కొత్త ఆకర్షణ

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగిలో ఏపీటీడీసీకి ఇప్పటికే రిసార్టులు ఉన్నాయి. వాటి పక్కనే ఈ సరికొత్త జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాటేజీలు, రెస్టారెంట్‌కు అదనంగా ఈ డోమ్ రిసార్టులను ఏర్పాటు చేస్తే.. ఈ ప్రాంత పర్యాటక ఆకర్షణ మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఊటీని తలపించే శీతల వాతావరణం, చుట్టూ అల్లుకునే దట్టమైన పొగమంచుకు లంబసింగి ప్రసిద్ధి చెందింది. ఏటా ఇక్కడికి వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వారికి సరికొత్త వసతి అనుభవాన్ని అందించేందుకు ఏపీటీడీసీ శ్రీకారం చుట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ డోమ్ రెస్టారెంట్ నిర్మించాలని ప్రణాళికలు రూపొందించగా.. ప్రస్తుత అధికారులు ఆ ప్రాజెక్టుకు మెరుగులు దిద్ది, పూర్తి స్థాయి డోమ్ రిసార్టులు తీసుకురావాలని నిర్ణయించారు.

రూ. 5.33 కోట్లు.. 15 డోమ్ యూనిట్లు..

ప్రకృతిని వీక్షించడానికి, ఆస్వాదించడానికి వీలుగా.. పర్యాటకుల ఏకాంతానికి భంగం కలగకుండా కొండ ప్రాంతంలో ఈ జియోడెసిక్ డోమ్ రిసార్టులు ఏర్పాటు కానున్నాయి. రూ.5.33 కోట్ల వ్యయంతో మొత్తం 15 డోమ్ రిసార్టులను నిర్మించనున్నారు. ఇందుకోసం ఏపీటీడీసీ ఆర్‌ఎఫ్‌పీ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) ఆహ్వానించింది. జియోడెసిక్, పుట్టగొడుగు ఆకారపు డోమ్‌లతో పాటు, అథారిటీ ఆమోదించిన మరికొన్ని విభిన్న నమూనాల్లో రిసార్టులను నిర్మిస్తారు. వీటికి రెయిలింగ్ సపోర్ట్‌తో కూడిన బేస్‌మెంట్ ఉంటుంది. ఫ్రంట్ ఎండ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ఇంజనీరింగ్ డిజైన్ (ఫీడ్) ఆధారంగా.. పర్యావరణానికి హాని కలగని రీతిలో.. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించాలన్నది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ప్రస్తుత కాటేజీలకు ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో, అలాగే రిసార్ట్ నిర్మాణాల పైన ఉన్న ఎత్తైన ప్రదేశంలో వీటిని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒక్కో డోమ్ యూనిట్ 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడే 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో పిల్లల కోసం ఆటస్థలం కూడా నిర్మించనున్నారు. సందర్శకులు విహరించేందుకు ఆరు సీట్ల ఈవీ బగ్గీలు రెండు అందుబాటులో ఉంచుతారు. ప్రతి డోమ్‌లో 7/6 బెడ్, రాకింగ్ చైర్, 3/3 సైడ్ టేబుల్స్, వార్డ్‌రోబ్, లగేజ్ ర్యాక్, డ్రెస్సింగ్ టేబుల్, నాలుగు కుర్చీలతో కూడిన కాఫీ టేబుల్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు.



డోమ్ రిసార్టుల నిర్మాణం చేపట్టనున్న లంబసింగిలోని కొండ ప్రాంతం

మూడు నెలల్లో నిర్మాణం పూర్తి



లంబసింగికి దేశ, విదేశాల నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకులకు కొత్త అనుభూతిని అందించేందుకు డోమ్ రిసార్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించాం. కాంట్రాక్టు ఖరారైన మూడు నెలల్లోనే ప్రాజెక్టు పూర్తి చేయాలని నిబంధన విధించాం. భూమికి సంబంధించిన అనుమతుల నుంచి నిర్మాణం పూర్తి చేసి, వినియోగానికి సిద్ధంగా ఉన్న స్థితిలో అప్పగించే వరకు పూర్తి బాధ్యత ఎంపికైన కాంట్రాక్టర్‌దే. ఇవి అందుబాటులోకి వస్తే ఏజెన్సీలో మరింతగా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది.

– జీవీటీ జగదీష్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్

దేశంలో రక్త అవసరాన్ని తీర్చడం అంత సులభం కాదు

మంత్రి సత్యకుమార్



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కొమ్మాది: సుమారు 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో రక్త అవసరాలు తీర్చడం అంత సులభం కాదని, ఇలాంటి పరిస్థితుల్లో హేతుబద్ధ వినియోగం జీవన విధానం మారాలని, తద్వారా రక్త సరఫరా కొరతను అధిగమించవచ్చని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'రక్తం, రక్త ఉత్పత్తుల హేతుబద్ధ వినియోగం' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో ఏటా అవసరమైన రక్తం సుమారు 1.5 కోట్ల యూనిట్లు అంచనా కాగా, 10–40 లక్షల యూనిట్ల కొరత ఉందని నివేదికలు చెబుతున్నాయన్నారు. రక్తం, దాని ఉత్పత్తులను హేతుబద్ధంగా వినియోగించడం అంటే సరైన సమయంలో సరైన వ్యక్తికి సరైన రక్తాన్ని అందించడమేనన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా రక్త వినియోగంలో శాస్త్రీయ, మానవతా దృక్పథం రెండింటినీ సమన్వయం చేయాలని కోరారు.

వాల్మీకి రామాయణం.. మహత్తర సందేశం

వాల్మీకి జయంతి వేడుకల్లో కలెక్టర్

మహారాణిపేట: మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వాల్మీకి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకి మానవ జీవితానికి అనువైన విధంగా రామాయణాన్ని రచించారని.. దాని ద్వారా ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని గుర్తుచేశారు. కారణ జన్ముడిగా నిలిచిన ఆయన.. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని కొనియాడారు. డీఆర్వో భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై దాడి దురదృష్టకరం



టి.షారోన్‌రాజు

విశాఖ సిటీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి దురదృష్టకరమని ఆంధ్రా యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయీస్(టీచర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారోన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, అభ్యుదయవాదులు.. ఇలా దేశంలో ప్రతి పౌరుడు ముక్తకంఠంతో ఈ చర్యను ఖండించాలన్నారు. భారత రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ ఎంతో ప్రధానమైనదని, సుప్రీంకోర్టులోనే ఈ ఘటన జరగడం దారుణమన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్



ఆరిలోవ: దశాబ్దాలుగా ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత అంశం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. 2010 సంవత్సరం కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా అమలు కావాల్సిన పరిస్థితి నెలకొనడంతో, రాష్ట్రంలోని ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర సందిగ్ధంలో పడ్డాయి.

విద్యా హక్కు చట్టం–2010 ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అయితే, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు మేరకు, 2010 కంటే ముందు వివిధ డీఎస్సీల ద్వారా ఉద్యోగాలు పొందిన వేలాది మంది కూడా టెట్ రాయాల్సి రావడంపై వారు ఆవేదన చెందుతున్నారు. డీఎస్సీ కోసం చదివి ఉద్యోగం సాధించిన మేము ఇప్పుడు మళ్లీ అర్హత పరీక్ష రాయడమేమిటి? అంటూ ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఈ తీర్పు ప్రభావం విశాఖ ఉమ్మడి జిల్లాలో భారీగా ఉంది. ఇక్కడ ప్రభుత్వ యాజమాన్యాలలో సుమారు 17,000 మంది ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల్లో మరో 12,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేట్ టీచర్లు కూడా ఈ తీర్పు ప్రకారం టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ఇన్ సర్వీస్‌లో ఉన్నవారు టెట్‌లో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగానికి ఇబ్బంది తప్పదు. ఉద్యోగ విరమణకు ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్నవారికి మినహాయింపు ఇచ్చారు. అంతకంటే ఎక్కువ సర్వీస్ ఉన్నవారు తప్పనిసరిగా ఆగస్టు 31, 2027 లోపు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలి. పదోన్నతి కావాలనుకునేవారు కూడా తప్పనిసరిగా టెట్ రాయాల్సి ఉంటుంది. రెండేళ్ల లోపు టెట్ పాస్ కాకపోతే ఉద్యోగం వదులుకోవాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి

ఈ కీలక సమయంలో రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం టెట్ అంశంపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయుల్లో సందిగ్ధత మరింత పెరిగింది. మరోవైపు, టెట్ పరీక్షపై వారంలో నోటిఫికేషన్ విడుదల కానుందనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. దశాబ్దాల సర్వీస్ ఉన్నవారికి పరీక్ష రాయడం, అర్హత సాధించడం తీవ్ర సమస్యగా మారింది. అందువల్ల, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత వ్యవహారంలో మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

టెట్ పరీక్ష విధానం

- **ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు** రాయాల్సిన **టెట్ పరీక్ష వివరాలు:**
- **పేపర్లు: ఎస్జీటీలు** పేపర్–1, స్కూల్ అసిస్టెంట్లు **పేపర్–2 రాయాల్సి** ఉంటుంది.
- **మార్కులు:** రెండున్నర గంటల (150 నిమిషాలు) సమయంలో 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- **ఉత్తీర్ణత మార్కులు:**
- **ఓసీ అభ్యర్థులు: 60** శాతం మార్కులు (90 మార్కులు).
- **బీసీ అభ్యర్థులు: 50** శాతం మార్కులు (75 మార్కులు).
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగు **అభ్యర్థులు:** 40 శాతం మార్కులు (60 మార్కులు).

ఎవరికీ లేని నిబంధనలు ఉపాధ్యాయులకేనా..?



రాష్ట్రంలో ఏ శాఖలో ఉద్యోగులకు లేని నిబంధనలు ఒక్క ఉపాధ్యాయులకే ఎందుకు పెడుతున్నారో అర్థంకావడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై ప్రయోగాలు చేస్తున్నాయి. ఉపాధ్యాయులు అవసరాలు పట్టించుకోకుండా, సమస్యలు పరిష్కరించకుండా వదిలేశాయి. ఇలాంటి నిబంధనలు మాత్రం మాపై రుద్దడం మంచిదికాదు. మరో వారంలో టెట్ పరీక్ష కోసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. దశాబ్దాలుగా ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మళ్లీ ప్రత్యేకంగా అర్హత పరీక్ష నిర్వహించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సరైన నిర్ణయం ఇంతవరకు ప్రకటించకపోవడం బాధాకరం.

– టి.ఆర్ అంబేద్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

టెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్షలకు మినహాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఐదు సంవత్సరాలు పైబడి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా రెండేళ్లలో టెట్ పరీక్ష నుంచి అర్హత సాధించాలని, లేదంటే ఉద్యోగం నుంచి తప్పుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయడంతో ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 2010 అక్టోబరు 23 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులంతా కచ్చితంగా టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు పదోన్నతలను, మరికొందరు పూర్తిగా ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. రెవెన్యూ, పోలీస్, వైద్యులు తదితర వృత్తుల్లో ఉన్నవారికి, ఉన్నతాధికారులకు లేని ఇన్ సర్వీస్ అర్హత ఉపాధ్యాయులకు మాత్రమే వర్తింపజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– ఇమంది పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ

మాజీ సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలకాలి



వలంటీర్ విభాగ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

వలంటీర్ల సమావేశంలో కేకే రాజు

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉమ్మడి విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో.. మంగళవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వలంటీర్ విభాగ సమావేశం జరిగింది. జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు ఉమ్మడి విశాఖకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. వలంటీర్ విభాగం జోనల్ ఇన్‌చార్జి సునీల్, రాష్ట్ర వలంటీర్ విభాగ ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శి పచరపల్లి రాము, వలంటీర్ విభాగ జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

యలమంచిలి రూరల్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో అండర్–19 బాల బాలికల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు గురువారం నుంచి జరుగుతాయని ఉమ్మడి విశాఖ జిల్లా జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత తెలిపారు. 2007 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన 6 నుంచి 12వ తరగతిలోపు బాల బాలికలు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఓపెన్ స్కూల్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదువుతున్న, చదివిన విద్యార్థులు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులు కాదన్నారు. ఎంపికలకు వచ్చే విద్యార్థులు వారి వయస్సు ధ్రువీకరణ పత్రం, విద్యార్థి పెన్ నెంబరు, విద్యార్థి చదువుతున్న తరగతి స్టడీ సర్టిఫికెట్, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే ఎంపికలకు ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94408 85898, 99516 76965, 99669 31556, 99850 65340, 98854 73808, 94938 83466 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. ఆయనపై దాడిని ముక్తకంఠంతో ఖండించి, న్యాయవ్యవస్థను రక్షించాలని నినాదాలు చేశారు.

అదానీ సిమెంట్ కంపెనీ వద్దే వద్దు

జీవీఎంసీ కమిషనర్‌కు వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వినతి



వినతిపత్రం చూపుతున్న కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, గంగారావు, స్టాలిన్

డాబాగార్డెన్స్: గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లో అదానీ సంస్థ 40 లక్షల సామర్థ్యంతో తలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మంగళవారం కోరారు. సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదన రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ, వెంటనే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలన్నారు. ప్రతిపాదిత సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలు దుమ్ము, ధూళి, విష కణాలతో నిండిపోతాయని, తాగునీరు కాలుష్యానికి గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు శ్వాసకోశ, గుండె, క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే అదానీ గంగవరం పోర్టు కారణంగా గాజువాక పరిసర ప్రాంతాలు బొగ్గు, ధూళితో తీవ్రంగా కాలుష్యానికి గురవుతున్నాయని వివరించారు. సిమెంట్ కంపెనీ కోసం కేటాయించిన 20 ఎకరాల భూమిని గంగవరం పోర్టు నిర్మాణానికి ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం కింద ఇచ్చారని, ఈ భూమిలో ఇతర కంపెనీ నిర్మాణం చట్ట విరుద్ధమని, భూ ఒప్పందం కూడా చట్ట వ్యతిరేకమని ఆరోపించారు. బుధవారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని.. నగర పౌరుల తరఫున సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని జీవీఎంసీ కమిషనర్‌కు అందజేసిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. అలాగే జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్‌తో కలిసి ఆయన మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని అందులో పేర్కొన్నారు.

చిట్టీల సొమ్ము రూ.కోటితో భార్యాభర్తలు పరార్



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కొమ్మాది: చిట్టీల పేరుతో సుమారు కోటి రూపాయల సొమ్మును వసూలు చేసి భార్యాభర్తలు పరారైన సంఘటన ఎండాడలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో సందీపిని నగర్‌లోని స్వగృహ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వై.రమణమ్మ చిట్టీలు వేస్తోంది. ఈ క్రమంలో ఆమె గత కొన్నేళ్లుగా స్థానికుల నుంచి సుమారు కోటి రూపాయల వరకు వసూలు చేసింది. చిట్టీల కాలపరిమితి దగ్గర పడుతుండటంతో.. బాధితులు నాలుగు నెలలుగా ఆమెను డబ్బు అడుగుతున్నారు. అయితే, ఆమె సమయం దాటవేస్తూ వస్తోంది. బాధితులందరూ మూకుమ్మడిగా వచ్చి తమ డబ్బులు అడగగా.. రమణమ్మ తన భర్త ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అని, తమను ఇబ్బంది పెడితే వివిధ కేసులు బనాయిస్తానని హెచ్చరించింది. దీంతో బాధితులు ఇటీవల పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, ప్రస్తుతం రమణమ్మ, ఆమె భర్త పరారీలో ఉన్నారు. మంగళవారం రమణమ్మ ఇంటి వద్ద బాధితులు ఆందోళన చేశారు. పరారీలో ఉన్న రమణమ్మను పట్టుకుని తమ డబ్బును తిరిగి ఇప్పించాలని పీఎంపాలెం పోలీసులను కోరారు. ప్రస్తుతం ఆమె కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

స్నేహితుడిపై చాకుతో దాడి

- డబ్బుల కోసం వివాదం
- యువకుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు దినేష్

పెదగంట్యాడ: స్నేహితుడిపై చాకుతో దాడి చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు గాజువాక పోలీసులు తెలిపారు. అక్కిరెడ్డిపాలేనికి చెందిన కుప్పిలి మణిదీప్, మిందికి చెందిన ఉంగరాల దినేష్ స్నేహితులు. వీరిద్దరూ తరచుగా కలిసి మద్యం సేవిస్తుంటారు. నెల రోజుల కిందట దినేష్ లంకెలపాలెంలోని ఓ ఫార్మా కంపెనీలో దినసరి కూలీగా మణిదీప్‌ను పనిలో చేర్చాడు. అయితే మణిదీప్ వారం రోజులకే పని మానేశాడు. ఆ వారం రోజుల వేతనాన్ని కాంట్రాక్టర్ దినేష్‌కు ఇచ్చాడు. ఈ డబ్బులు ఇవ్వాలని మణిదీప్ పదేపదే అడగడంతో, ఆగ్రహానికి గురైన దినేష్ అతడిని చంపుతానని బెదిరించాడు. ఈ నెల 2వ తేదీన.. మణిదీప్‌ను అక్కిరెడ్డిపాలెం చెరువు వద్దకు రమ్మని దినేష్ ఫోన్ చేసి పిలిచాడు. రాత్రి 8 గంటల సమయంలో ఇద్దరూ చెరువు వద్ద కలుసుకున్నారు. ఆ తరువాత మణిదీప్ తన డబ్బులు ఇవ్వాలని అడగడంతో.. దినేష్ తనతో పాటు తెచ్చుకున్న చాకుతో మణిదీప్‌పై దాడి చేశాడు. మణిదీప్ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో దినేష్ అక్కడి నుంచి పారిపోయాడు. మణిదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక సీఐ పార్థసారథి కేసు నమోదు చేశారు. నిందితుడైన దినేష్‌ను మంగళవారం శ్రీనగర్ బస్టాప్ వద్ద అరెస్ట్ చేశారు. ఎస్ఐ సూర్యకళ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే బలిగొంది..

సత్తిబాబు కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



సత్తిబాబు (ఫైల్)

మహారాణిపేట/మద్రిపాలెం: జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ లైన్‌మన్ సత్తిబాబు (47) మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సోమవారం విద్యుదాఘాతంతో సత్తిబాబు మరణించిన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు స్పందించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే.. : సోమవారం సాయంత్రం మురళీనగర్ ప్రాంతంలో సత్తిబాబు తన హెల్పర్‌తో కలిసి వీధి దీపాలకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో స్తంభం పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగలడంతో ఆయన షాక్‌కు గురై కిందపడిపోయారు. సహచర ఉద్యోగులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తోటి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వాస్తవానికి వీధి దీపాల మరమ్మతులు చేయాల్సిన రెగ్యులర్ సిబ్బంది రావడం లేదు. వారితో పనులు చేయించకుండా, మాతో ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నారు. సత్తిబాబు మరణానికి జీవీఎంసీ అధికారులదే పూర్తి బాధ్యత' అని వారు ఆరోపించారు. ఉద్యోగి చనిపోయి గంటలు గడుస్తున్నా ఏ ఒక్క అధికారి కనీసం పరామర్శించడానికి రాకపోవడంపై వారు మండిపడ్డారు. మృతుడు సత్తిబాబుకు భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణాఫ్రికా మహిళా జట్టు వచ్చేసింది

విజయమే లక్ష్యంగా టీమిండియా ప్రాక్టీస్



సాధన చేస్తున్న భారత మహిళా జట్టు

విశాఖ స్పోర్ట్స్/గోపాలపట్నం: ఐసీసీ ప్రపంచ మహిళా క్రికెట్ కప్ కీలక ఘట్టానికి విశాఖపట్నం సిద్ధమైంది. ఐదు వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్న వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 9న జరిగే మొదటి మ్యాచ్ కోసం దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్టు మంగళవారం నగరానికి చేరుకుంది. విశాఖ వేదికగా తొలి మ్యాచ్ ఆడబోతున్న భారత్ మహిళల జట్టు ఇప్పటికే ఇక్కడికి చేరుకుని మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ముమ్మరంగా ప్రాక్టీస్ చేసింది. కాగా.. టీమిండియా ఈ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ విజయంపై కన్నేసింది. గత ప్రపంచ కప్‌లో ఐదో స్థానంతో సంతృప్తి పడిన భారత్.. ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఘన విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. శ్రీలంకను 59 పరుగుల తేడాతో, పాకిస్తాన్‌ను 88 పరుగుల తేడాతో ఓడించి మంచి ఊపు మీదుంది. విశాఖ వేదికగా ఆ ఊపును కొనసాగించాలని పట్టుదలతో ఉంది. భారత్ ఈ నెల 9న దక్షిణాఫ్రికాతో, 12న ఆస్ట్రేలియాతో తలపడనుంది. రెండుసార్లు ప్రపంచకప్ ఫైనల్‌కు చేరినా (2005లో ఆస్ట్రేలియా చేతిలో, 2017లో ఇంగ్లాండ్ చేతిలో) టైటిల్ సాధించలేకపోయిన భారత జట్టు.. ఈసారి కప్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మరోవైపు, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మహిళా జట్లు రెండేసి మ్యాచ్‌లు ఆడినా పాయింట్ల పట్టికలో వెనుకబడి ఉన్నాయి.



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న దక్షిణాఫ్రికా మహిళా క్రికెటర్లు

గిరిజన బిడ్డల మృతి ప్రభుత్వ నిర్లక్ష్యమే...

కేజీహెచ్‌లో విద్యార్థినులను పరామర్శించిన షర్మిల



విద్యార్థులను పరామర్శిస్తున్న ఏపీసీసీ చీఫ్ షర్మిల

మహారాణిపేట: కురుపాం గురుకుల విద్యార్థినుల మరణం పట్ల ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆమె పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గిరిజన బిడ్డల మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ హాస్టల్లోనూ ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని, వందల మంది విద్యార్థినులకు ఒకే బాత్రూం ఉండటం దారుణమని విమర్శించారు. తాను 'గుడితో పాటు బడి ముఖ్యం' అని గతంలో చేసిన వ్యాఖ్యలకు మతం రంగు పులిమి తనపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై ప్రభుత్వం వెంటనే ఒక హైలెవల్ కమిటీ వేయాలని, రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లను బాగుచేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.